సాక్షి
అనంతపురం
ఆదివారం । 17 । సెప్టెంబర్ । 2023



చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22 వేలు పలికాయి.



మట్టి గణపతిని పూజిద్దాం

'సాక్షి' మీడియా గ్రూప్, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శనివారం అనంతపురంలో 'చిన్నారుల చేతుల్లో మట్టి గణపతి' శిక్షణ శిబిరం నిర్వహించారు. 8లో

గరిష్టం/కనిష్టం
36.2°/ 22.5°

జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

పారిశ్రామిక మంత్రం

- పెట్టుబడులతో వస్తే భారీగా రాయితీలు
- సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలకు పెద్దపీట
- గతేడాది జిల్లాలో 4,225 ఎంఎస్ఎంఈల ఏర్పాటు
- రూ.322.64 కోట్ల పెట్టుబడులు వచ్చినట్టు పరిశ్రమల శాఖ నివేదిక
- పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్న సింగిల్ డెస్క్ పోర్టల్ విధానం

పారిశ్రామిక ప్రగతికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లా రెండుగా విడిపోయాక శ్రీసత్యసాయి జిల్లాకు ఎక్కువ పరిశ్రమలు వెళ్లాయి. అనంతపురంలో సిమెంటు పరిశ్రమలు మాత్రమే మిగిలాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ఏర్పాటుకు భారీగా కసరత్తు జరుగుతోంది. ఎక్కువగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలకే ప్రాధాన్యత ఇస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు నెలకొల్పే పెట్టుబడిదారులకు ప్రభుత్వం భారీగా రాయితీలు ఇస్తోంది. 2023–24 ఇండస్ట్రియల్ పాలసీ ప్రకారం ఓసీ, బీసీ వర్గానికి చెందిన వారికి 'జగనన్న బడుగు వికాసం' కింద భారీగా వడ్డీ రాయితీలు ఇస్తారు. అలాగే ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు వడ్డీ రాయితీ, పవర్ వినియోగంలో రాయితీ, అమ్మకపు పన్నుపై రాయితీ లాంటివి ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 676 ఎంఎస్ఎంఈలకు వివిధ రకాల రాయితీల కింద ప్రభుత్వం రూ.62.19 కోట్లు మంజూరు చేసింది.

పీఎంఈజీపీకి భారీగా దరఖాస్తులు

ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ) కింద భారీగా దరఖాస్తులు వచ్చాయి. గత ఏడాది 471 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి బ్యాంకుల ద్వారా రూ.16.29 కోట్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపగా, 153 యూనిట్లకు రూ.5.75 కోట్లు మంజూరయ్యింది. ఇందులో 114 యూనిట్లు స్థాపించి 1,346 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఇప్పటివరకూ 99 దరఖాస్తులు రాగా, ఇందులో 43 యూనిట్లకు మార్జిన్ మనీకింద రూ.1.76 కోట్లు మంజూరైంది. ఈ పరిశ్రమల ద్వారా 475 మందికి ఉపాధి ఇస్తున్నారు.

సింగిల్ డెస్క్ పోర్టల్‌తో అనుమతులు వేగవంతం

పరిశ్రమను స్థాపించాలనుకుంటే అధికారుల దగ్గరకు కాళ్లరిగేలా తిరగాల్సిన అవసరం లేదు. పరిశ్రమల శాఖ పోర్టల్‌లో దరఖాస్తు చేసిన 24 గంటల్లోనే అధికారులే సంప్రదిస్తారు. పరిశ్రమకు కావాల్సిన స్థలం, బ్యాంకు లింకేజీ, మార్జిన్ మనీ, రాయితీలు వంటి వాటిపై అధికారులే సలహాలు, సూచనలు ఇస్తారు. ఈ ఏడాది సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా 53 పరిశ్రమలు 118 అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. వీటిలో ఇప్పటికే 97 అనుమతులు మంజూరయ్యాయి. మరో 21 అనుమతులు వివిధ దశల్లో ఉన్నాయి. కూడేరు వద్ద అతిపెద్ద పారిశ్రామిక పార్కు కూడా వస్తున్న విషయం తెలిసిందే.



గుత్తి పట్టణంలో ఐస్ క్రీమ్ తయారీ యూనిట్

రెండేళ్లలో అనంతపురం జిల్లాలో పరిశ్రమలు ఇలా..

2022-23లో వచ్చిన ఎంఎస్ఎంఈలు	4,225
ఎంఎస్ఎంఈల ద్వారా పెట్టుబడులు	రూ.322.64 కోట్లు
ఉద్యోగం, ఉపాధి పొందిన వారు	13,206
2023-24 సంవత్సరంలో ఎంఎస్ఎంఈలు	771
వీటిద్వారా వచ్చిన పెట్టుబడులు	రూ.49.16 కోట్లు
ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందినవారు	2,645

పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక రాయితీలు



పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే యువ పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక రాయితీలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలందిస్తోంది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ పార్కులను నెలకొల్పింది. వాటిలో స్థలాలను సైతం ప్రభుత్వమే అందించి యూనిట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తోంది. గడిచిన నాలుగేళ్ల కాలంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేసింది. – నాగరాజరావు, జనరల్ మేనేజర్, పరిశ్రమల శాఖ

రాయితీకి సిఫార్సు



పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే యువ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వంతోపాటు అధికార యంత్రాంగం సైతం ప్రోత్సాహాన్ని అందిస్తోంది. ఈ ఏడాది మార్చిలో డెయిరీ ఫ్రెష్ పేరిట ఐస్‌క్రీమ్ తయారు చేసే పరిశ్రమను రూ.75లక్షల పెట్టుబడితో ఏర్పాటు చేశాం. ఇక్కడ వివిధ రకాల ఐస్‌క్రీమ్‌లను తయారు చేసి రాయలసీమ అంతటా సరఫరా చేస్తున్నాం. పరిశ్రమలో 15 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తున్నాం. ఇటీవలే పరిశ్రమల శాఖ అధికారులు యూనిట్‌ను పరిశీలించి రాయితీకి సిఫార్సు చేశారు.
– రమేష్‌నాయక్, గుత్తి

అధికారుల చొరవ ప్రశంసనీయం



గార్లదిన్నెలో రెండేళ్ల క్రితం రూ.10 లక్షల పెట్టుబడితో మిల్లెట్ హౌస్ పేరిట చిన్న కుటీర పరిశ్రమ నెలకొల్పాం. పరిశ్రమల శాఖ అధికారులు బ్యాంకర్లతో చర్చించి రూ.6.50 లక్షలకు పైగా రుణాన్ని ఇప్పించారు. 35శాతం రాయితీని అందించారు. ప్రస్తుతం ఇక్కడ వివిధ రకాల చిరు ధాన్యాలతో తయారు చేస్తున్న మిలెట్ ఉత్పత్తులను ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు విజయవాడ, కర్నూలు జిల్లాలకు ఎగుమతులను చేస్తున్నాం. మరో రెండు నెలల్లో ఆశ్వగంధం ఉత్పత్తులను ప్రారంభిస్తున్నాం.
– రాజేశ్వరి, ప్రాణి హోం ఫుడ్స్, గార్లదిన్నె

న్యూస్‌రీల్

నూతన ఎస్పీకి ఘన స్వాగతం

- నేడు బాధ్యతల స్వీకరణ



అన్బురాజన్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

అనంతపురం క్రైం: నూతన ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ శుక్రవారం అనంతపురం చేరుకున్నారు. మధ్యాహ్నం 12.45 గంటలకు క్లాక్‌టవర్ సమీపంలోని పోలీసు అతిథిగృహం వద్ద ఎస్పీకి సెబ్ అదనపు ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీలు ప్రసాద్‌రెడ్డి, టీవీ శివారెడ్డితో పాటు నగర సీఐలు ఘన స్వాగతం పలికారు. ఎస్పీకి జిల్లా పోలీసు అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో డీఎస్పీలతో పాటు సీఐలు జాకీర్ హుస్సేన్, ఇందిర, విశ్వనాథ్ చౌదరి, రెడ్డెప్ప, శివరాముడు, ధరణీకిశోర్, ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, ఆర్ఐలు హరికృష్ణ, రాముడు, జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనాధికారి శంకర్, ఎస్పీ సీసీ ఆంజనేయప్రసాద్ ఉన్నారు. ఎస్పీగా అన్బురాజన్ ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

చట్టం సంపూర్ణంగా అమలవ్వాలి



సమావేశం నిర్వహిస్తున్న కమిషన్ సభ్యుడు శర్మ

అనంతపురం అర్బన్: జిల్లాలో జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్ఎఫ్ఎస్ యాక్ట్) సంపూర్ణంగా అమలు చేయాలని కేంద్ర కమిషన్ సభ్యుడు ప్రొఫెసర్ బీఎన్ శర్మ అధికారులను ఆదేశించారు. జిల్లాలో జాతీయ ఆహార భద్రత చట్టం అమలు తీరు పరిశీలనకు విచ్చేసిన ఆయన శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో డీఎస్ఓ శోభారాణితో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. బియ్యం పంపిణీలో కార్డుదారుల నుంచి ఫిర్యాదులు రాకూడదన్నారు. కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ నీలమయ్య, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ నేత బండారు రవికుమార్ అరెస్ట్

- దివ్యాంగురాలి ఆత్మహత్య కేసులో రిమాండ్



పోలీసులు అరెస్ట్ చేసిన బండారు రవికుమార్

బుక్కరాయసముద్రం: దివ్యాంగురాలి భూమిని లాక్కుని, ఆమె ఆత్మహత్యకు కారకులైన కేసులో నిందితుడైన ఆమె మేనమామ, టీడీపీ నాయకుడు బండారు రవికుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం సాయంత్రం బుక్కరాయసముద్రం పోలీస్ స్టేషన్‌లో సీఐ నాగార్జునరెడ్డి మీడియాకు వెల్లడించారు. సిద్దరాంపురంలో తన భూమిని టీడీపీ శింగనమల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రావణి తండ్రి అయిన ఆ పార్టీ నేత బండారు రవికుమార్ కాజేశాడని దివ్యాంగురాలైన నాగరాణి అలియాస్ రాజమ్మ (44) ఈ నెల 14న సెల్ఫీ వీడియోలో వివరించి, విషపుద్రావకం తాగడంతో పాటు ఉరేసుకుని చనిపోయింది. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి ఆదేశాల మేరకు సీఐ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీనివాస్ శనివారం నిందితుడు రవికుమార్‌ను అరెస్ట్ చేశారు. జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ మొబైల్ కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసులో నిందితుడికి న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు.

బీటెక్‌లో ఆనర్స్ విధానం



మాట్లాడుతున్న వీసీ జింకా రంగజనార్దన

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) పరిధిలో బీటెక్ కోర్సుల్లో ఆనర్స్ విధానం తీసుకురానున్నట్లు వీసీ జింకా రంగజనార్దన అన్నారు. యూనివర్సిటీలోని ప్రిన్సిపాల్ కార్యాలయంలో శనివారం వీసీ అధ్యక్షతన జరిగిన బీటెక్ ప్రోగ్రాం బోర్డ్ ఆఫ్ స్టడీస్ కామన్ బోర్డు సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. బీటెక్ కోర్సు విద్యాప్రణాళిక పునఃపరిశీలనలో భాగంగా మార్పుచేర్పులు ఉంటాయని పేర్కొన్నారు. రెగ్యులర్ కోర్సుతో పాటు ఆనర్స్ డిగ్రీని ప్రవేశపెడుతున్నామన్నారు. 5 ప్రొఫెషనల్ ఎలక్టివ్స్, 4 ఓపెన్ ఎలక్టివ్స్, 5 ఓరియంటెడ్ కోర్సులను, క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ పాలసీని ప్రవేశపెడుతున్నామన్నారు. 2 సమ్మర్ ఇంటర్న్‌షిప్‌లను రెండో సంవత్సరం, మూడో సంవత్సరం చివరలో నిర్వహించాల్సి ఉంటుందన్నారు. నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్‌లో ప్రాజెక్ట్ లేదా ఇంటర్న్‌షిప్ సెమిస్టర్ మొత్తం ప్రవేశపెడుతున్నామన్నారు. వీటితో పాటు ఆడిట్ కోర్సులను పూర్తి చేయాలన్నారు. రెగ్యులర్ డిగ్రీలో మూడో సెమిస్టర్ వరకు 7 సీజీపీఏ సాధించిన విద్యార్థులు మాత్రమే డిగ్రీ రిజిస్టర్ చేసుకోవడానికి అనుమతి ఇస్తామన్నారు. డిగ్రీలో మల్టీ ఎగ్జిట్ విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఫస్టియర్ సిలబస్‌కు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, ప్రొఫెసర్ దుర్గాప్రసాద్, కృష్ణా వర్సిటీ మాజీ వీసీ చంద్రశేఖర్, పాలకమండలి సభ్యులు రామశేఖర్‌రెడ్డి, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్లు పాల్గొన్నారు.

ప్రజల ఆర్థికాభివృద్ధే లక్ష్యం


- సంక్షేమ పథకాల ద్వారా సర్కారు తోడ్పాటు
- 'కాపు నేస్తం' నాల్గో విడత కింద 4,989 మంది మహిళలకు లబ్ధి
- ఆర్థిక సాధికారత సాధించాలని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, జేసీ కేతన్‌గార్గ్ పిలుపు



మెగా చెక్కు విడుదల చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జేసీ కేతన్‌గార్గ్ తదితరులు


అనంతపురం అర్బన్: ప్రజల జీవన ప్రమాణాలు పెంచి తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'వైఎస్సార్ కాపు నేస్తం' నాల్గో విడత నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేశారు. అనంతపురం కలెక్టరేట్ నుంచి జెడ్పీ చైర్‌పర్సన్, జాయింట్ కలెక్టర్‌తో పాటు డీఆర్ఓ గాయత్రీదేవి, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ పాల్గొన్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్, జాయింట్ కలెక్టర్ మాట్లాడారు. ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా పథకాలను అమలు చేస్తూ నేరుగా వారి ఖాతాల్లోకి నగదు జమ చేస్తున్నారన్నారు. వైఎస్సార్ కాపు నేస్తం పథకం కింద కాపు, తెలగ, ఒంటరి, బలిజ కులాలకు చెందిన 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య వయసు ఉన్న మహిళల జీవనోపాధి అవకాశాలు, జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు. వైఎస్సార్ కాపునేస్తం నాల్గో విడత కింద జిల్లాలో 4,989 మంది లబ్ధిదారులకు రూ.7.483 కోట్ల మొత్తాని నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేశారన్నారు. 2019–20లో మొదటి విడత కింద 4,431 మందికి రూ.6.64 కోట్లు, 2021–22లో రెండో విడత కింద 4,121 మందికి రూ.6.18 కోట్లు, 2022–23లో మూడో విడత కింద 4,670 మంది లబ్ధిదారులకు రూ.7.0005 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని కాపు మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం మెగా చెక్కును విడుదల చేశారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రమణ్యం, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, ఉద్యాన శాఖ డీడీ రఘునాథ్‌రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధికి భరోసా



మహిళల జీవనోపాధికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. కాపు నేస్తం పథకం కింద మూడు విడతల్లో రూ.45 వేలు ఆర్థిక సహాయం అందుకున్నాను. నాకు వితంతు పింఛను వస్తోంది. మహిళల అభ్యున్నతికి, ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు
– జి.రత్న, సాయినగర్, అనంతపురం

వ్యాపారాభివృద్ధికి తోడ్పాటు



నేను చీరల వ్యాపారం చేస్తుంటాను. కాపు నేస్తం కింద నాలుగు విడతల్లో రూ.60 వేలు అందుకున్నాను. ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయంతో చీరల వ్యాపారం వృద్ధి చేసుకోవడంతో పాటు కుట్టుమిషన్ కొనుగోలు చేసి టైలరింగ్ చేస్తూ జీవనోపాధి పొందుతున్నాను. మహిళలకు అండగా నిలుస్తున్న సీఎంకు ఎప్పటికీ రుణపడి ఉంటాము.
– ఎల్.శ్రీదేవి, సాయినగర్, అనంతపురం

నిట్టూరులో దంపతుల హత్య

- హంతకుణ్ని రాళ్లతో కొట్టి చంపిన గ్రామస్తులు



హతులు ప్రసాద్, బాలరాజు,సుంకమ్మ (ఫైల్)

యాడికి: ఇంటి బయట నిద్రిస్తున్న భార్యాభర్తలను వేట కొడవలితో నరికి చంపడమే కాకుండా అడ్డొచ్చిన వారిపై దాడికి దిగిన మతిస్థిమితం లేని వ్యక్తిని గ్రామస్తులు మూకుమ్మడిగా రాళ్లతో కొట్టి చంపారు. ఈ ఘటన యాడికి మండలం నిట్టూరు గ్రామంలో శనివారం తెల్లవారుజామున మూడు గంటలకు చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని రజక కులానికి చెందిన బాలరాజు (52), సుంకులమ్మ (45) దంపతులకు సునీత, సుభద్ర, సుమలత అనే ముగ్గురు కూతుళ్లు, సుదర్శన్ అనే కుమారుడు ఉన్నారు. బాలరాజు కులవృత్తినే నమ్ముకుని ముగ్గురు కుమార్తెలకు పెళ్లిళ్లు చేసి అత్తారింటికి పంపారు. కుమారుడు సుదర్శన్ అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారం సమీపంలోని ఓ పెట్రోల్ బంకులో దినసరి కూలిగా పని చేస్తున్నాడు. వారి ఇంటి ఎదురుగా ఉండే వెంకటరాముడు, సుజాత దంపతులకు కుమారుడు ప్రసాద్(35) ఉన్నాడు. ఇతనికి పదేళ్ల క్రితమే వివాహమై.. ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. ప్రసాద్ తన తండ్రితో కలసి గ్రామ సమీపంలో కట్టెలు కొట్టి వాటితో బొగ్గు తయారు చేసి విక్రయించేవాడు. ప్రసాద్‌కు మూడేళ్లుగా మతి స్థిమితం లేదు. తరచూ భార్య మానికతో గొడవ పడేవాడు. బాలరాజు వారిని మందలిస్తూ మంచిగా కాపురం చేసుకోవాలని చెప్పేవాడు. పది రోజుల క్రితం మానికను ప్రసాద్ కొట్టడంతో పిల్లలిద్దరినీ తీసుకుని పుట్టింటికి పోయింది. శుక్రవారం భార్యను పిలుచుకు రావడానికి తాడిపత్రి వెళ్లిన ప్రసాద్ అక్కడ కూడా భార్యతో గొడవ పడి సాయంత్రం ఇంటికి తిరిగొచ్చాడు. భార్య కాపురానికి రాలేదని మనస్తాపం చెందిన అతను శనివారం తెల్లవారు జామున మూడు గంటల సమయంలో వేటకొడవలి తీసుకుని ఇంటి ఎదుట మంచంపై గాఢ నిద్రలో ఉన్న బాలరాజు, సుంకులమ్మ దంపతులను విచక్షణారహితంగా నరికాడు. ఆ శబ్దానికి పక్కనే అరుగుపై నిద్రిస్తున్న బాలరాజు కుమారుడు సుదర్శన్ నిద్రలేచాడు. రక్తపు మడుగులో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న తల్లిదండ్రులను చూసి గట్టిగా కేకలు వేశాడు. దీంతో చుట్టుపక్కల వారందరూ నిద్రలేచి రాగా వారిపైనా ప్రసాద్ కొడవలితో దాడికి యత్నించాడు. దీంతో కోపోద్రిక్తులైన బాలరాజు బంధువులు మూకుమ్మడిగా రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో ప్రసాద్ తల్లిదండ్రులు గ్రామం విడిచి వెళ్లిపోయారు. తాడిపత్రి డీఎస్పీ గంగయ్య, సీఐ శంకర్ రెడ్డి, తాడిపత్రి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు, యాడికి ఎస్ఐలు గ్రామానికి చేరుకుని మృత దేహాలను పరిశీలించారు. హత్యలకు దారి తీసిన పరిస్థితులను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. సుదర్శన్, గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

హంతకుడి మృతదేహం మున్సిపాలిటీకి..

బాలరాజు, సుంకమ్మ దంపతులను చంపి.. గ్రామస్తుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన ప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం తీసుకునేందుకు కుటుంబ సభ్యులు ముందుకు రాలేదు. తల్లిదండ్రులు పరారీలో ఉండగా.. భార్య తరపు వారు కూడా మృతదేహం తీసుకునేందుకు సుముఖత చూపలేదు. దీంతో ప్రసాద్ మృతదేహాన్ని పోలీసులు మున్సిపాలిటీ వారికి అప్పగించారు.

మట్టి గణపతిని పూజిద్దాం







మాట్లాడుతున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారి ఉమామహేశ్వరి (చిత్రంలో) విశ్వ భారతి స్కూల్ కరస్పాండెంట్ అనసూయ దేవి, మట్టి గణపతులను చేస్తున్న విద్యార్థులు

- 'సాక్షి' మీడియా గ్రూపు, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం
- ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతుల అందజేత
- అనంతపురంలోని కోవూర్ నగర్ విశ్వభారతి స్కూల్ వేదికగా సందడి

SAKSHI | సాక్షి | SAKSHI DIGITAL MEDIA GROUP | ఆంధ్రప్రదేశ్ ANDHRA PRADESH AP Pollution Control Board

అనంతపురం కల్చరల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతులనే పూజించాలని వక్తలు పిలుపునిచ్చారు. 'సాక్షి' మీడియా గ్రూపు, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో అనంతపురంలోని కోవూర్ నగర్‌లో ఉన్న విశ్వభారతి స్కూల్‌లో శనివారం 'చిన్నారుల చేతుల్లో మట్టి గణపతి' శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. 'సాక్షి' బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కిషోర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఉమామహేశ్వరి, విశ్వభారతి విద్యాసంస్థల కరస్పాండెంట్ అనసూయదేవి, ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి, సంస్కార భారతి ప్రధాన కార్యదర్శి లక్ష్మి, సాక్షి బ్యూరో ఇన్‌చార్జి రామచంద్రారెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జి మహేశ్వరరెడ్డి, టీవీ కరస్పాండెంట్ శివారెడ్డి తదితరులు హాజరయ్యారు.

సృజన చాటిన విద్యార్థులు

వివిధ పాఠశాలల నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన విద్యార్థులు సృజనాత్మకత ఉట్టిపడేలా మట్టితో వినాయకుడి ప్రతిమలు చేసి ఆకట్టుకున్నారు. మాస్టర్ ట్రైనర్‌గా ప్రముఖ చిత్రకారుడు కత్తి విజయ్‌కుమార్ వ్యవహరించి అందమైన ప్రతిమలను చేయించి అందరి మన్ననలందుకున్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రియాజుద్దీన్ శతక పద్యాలతో ఆలరించారు. విశ్వభారతి విద్యార్థులు శ్రీధరి, లక్ష్మీతన్మయి, శ్రీవల్లి... గణేశస్తుతితో భక్తిభావం పెంచారు. పాఠశాల నిర్వాహకులు సుగుణాకర్ మాట్లాడుతూ... వివిధ సామాజిక కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేసేలా 'సాక్షి' చేస్తున్న ప్రయత్నాన్ని అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు దోహదపడతాయన్నారు.

విజేతలు వీరే..

చిన్నారుల చేతిలో మట్టి గణేశుడు కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వివిధ స్కూళ్లకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై... ఒకే వేదికపై విభిన్న ఆకృతుల్లో గణపయ్యలను సిద్ధం చేశారు. అద్భుతమైన ప్రతిభతో సృజనను కనపరచిన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. నగరానికి చెందిన సుధీర్, హన్విత, నవనీత్ తొలి మూడు స్థానాలను దక్కించుకోగా, యశ్వంత్, బాబా రహమత్, యుగంధర్, నేహశ్రీ, ప్రియవిద్య, సోఫియా, అమృత కన్సొలేషన్ బహుమతులందుకున్నారు.





తొలి మూడు స్థానాలు దక్కించుకున్న విద్యార్థులు, కన్సొలేషన్ బహుమతులు అందుకున్న వారితో విశ్వ భారతి స్కూల్ కరస్పాండెంట్ అనసూయ దేవి, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఉమామహేశ్వరి, కృష్ణారెడ్డి, కిషోర్‌రెడ్డి, సాక్షి బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్, న్యాయనిర్ణేత సంధ్యామూర్తి

సంతోషంగా ఉంది

నేను అనంతపురంలోని పొట్టి శ్రీరాములు స్కూల్లో 10వ తరగతి చదువుతున్నా. ఇటీవల మా స్కూల్‌లో సృజనాత్మక కార్యక్రమాలు ఎన్నో జరుగుతున్నాయి. ఈ రోజు నేను చేసిన మట్టి గణేశుడి ప్రతిమకు ప్రథమ బహుమతి రావడం ఎంతో సంతోషంగా ఉంది.

– సుధీర్, ప్రథమ బహుమతి విజేత

మా వాళ్లకు చూపిస్తా

మట్టి గణేశుడి కార్యక్రమానికి వెళ్లమని మా అమ్మ, నాన్న, టీచర్లు ప్రోత్సహించారు. ఈ సారి మంచి బహుమతి రావడం ఆనందంగా ఉంది. నా విజయానికి కారణమైన మట్టి గణపతిని మా వాళ్లందరికీ చూపిస్తా.

– హన్విత, ద్వితీయ బహుమతి విజేత

మా స్కూల్ వాళ్లు ప్రోత్సహిస్తారు

మా స్కూల్‌లోనే మట్టి గణపతుల తయారీపై శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ విషయం తెలిసినప్పటి నుంచి మట్టితో గణేశుడి ప్రతిమను చేయడంపై బాగా ప్రాక్టీస్ చేశా. దీనికి తోడు మా మేడం వాళ్లు బాగా ప్రోత్సహించారు.

– నవనీత్, తృతీయ బహుమతి విజేత

సినీ ఫక్కీలో ఛేజింగ్... లారీ పట్టివేత

- జాయింట్ ఆపరేషన్ కింద ఛేదింపు

రాయదుర్గం: కేరళ నుంచి న్యూఢిల్లీకి లోడ్‌తో వెళుతున్న ఓ లారీ శుక్రవారం రాత్రి కర్ణాటక జీఎస్టీ అధికారుల కళ్లు గప్పి తప్పించుకుని ఆంధ్రలోకి ప్రవేశించింది. ఆద్యంతం సినీ ఫక్కీలో సాగిన ఛేజింగ్‌లో చివరకు ఆంధ్ర ప్రాంతంలో లారీ టైర్ బరస్ట్ కావడంతో కర్ణాటక పోలీసులు స్వాధీనం చేసుకోగలిగారు. వివరాలు... కేరళ నుంచి వస్తున్న లారీని కర్ణాటకలోని హనగల్ వద్ద జీఎస్టీ, సేల్స్ ట్యాక్స్ అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే లారీ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ముందుకు దూకించడంతో త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకుని తమ వాహనాల్లో వెంబడిస్తూ మొలకాల్మూరు పోలీసులకు సమాచారం అందించారు. దాదాపు 14 కిలోమీటర్ల మేర ఛేజింగ్ చేసినా లారీ వేగాన్ని పోలీసులు, జీఎస్టీ అధికారులు అందుకోలేకపోయారు. చివరకు రాయదుర్గం పట్టణ సమీపంలో నిర్మాణంలో ఉన్న బైపాస్ వద్దకు చేరుకోగానే టైర్లు బరెస్ట్ అయ్యాయి. వెనుకనే వెంబడిస్తూ వచ్చిన కర్ణాటక పోలీసులు, జీఎస్టీ అధికారుల వాహనాలు లారీని చుట్టుముట్టాయి. లారీ క్యాబిన్‌లో పరిమితికి మించి వ్యక్తులు ఉండడంతో అనుమానం వచ్చి వెంటనే రాయదుర్గం అర్బన్ సీఐ లక్ష్మన్నకు సమాచారం ఇస్తూ తమకు భద్రత కల్పించాలని కోరారు. ఘటనాస్థలానికి ఆగమేఘాలపై సిబ్బందితో చేరుకున్న సీఐ లక్ష్మన్న జరిగిన అంశాన్ని అడిగి తెలుసుకున్నారు. అయితే ఏపీ పరిధిలోకి రావడంతో లారీని స్వాధీనం చేసుకుని తామే కేసు నమోదు చేస్తామని సీఐ తెలపడంతో కర్ణాటక అధికారులు వీల్లేదన్నారు. చివరకు విషయాన్ని తెలుసుకున్న జిల్లా డిప్యూటీ కమర్షియల్ ట్యాక్స్ అధికారి సుదర్శన్, డీసీటీఓ రమణ రాయదుర్గం చేరుకుని బళ్లారి జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ ఇనామ్‌ధీర్, అసిస్టెంట్ కమిషనర్ అభిషేక్‌తో చర్చించారు. లారీలో ఉన్న సరుకుపై ఆరా తీశారు. వక్కలోడుతో వెళుతున్నట్లుగా డ్రైవర్, అతడి సహాయకులు తెలిపారు. ముందుగా గుర్తించిన కర్ణాటక జీఎస్టీ అధికారులకే కేసు నమోదు బాధ్యతలు అప్పగించేలా అంగీకారానికి వచ్చారు. అయితే రికార్డుల్లో మాత్రం ఇరు రాష్ట్రాల అధికారులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించినట్టు పొందుపరిచారు. ఇదిలా ఉండగా లారీలో వక్క కాకుండా గంధం చెక్కలు ఉన్నట్లుగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. లోడ్ తీసి చూపకుండా లారీని కర్ణాటకకు జీఎస్టీ అధికారులు తరలించారు.



రాయదుర్గం బైపాస్ వద్ద లారీని చుట్టుముట్టిన పోలీసుల వాహనాలు

పేగుబంధం మరువలేక తండ్రి బలవన్మరణం

అనంతపురం సిటీ: చిన్నారి మృతితో మనస్తాపం చెందిన తండ్రి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన మేరకు... కూడేరు మండం జయపురం నివాసి కె.మల్లికార్జున(20), మధులత దంపతుల మూడు నెలల చిన్నారి ఇటీవల మృతి చెందింది. అప్పటి నుంచి మల్లికార్జున తీవ్ర మనో వేదనలకు లోనై ఎవరితోనూ సరిగా మాట్లాడక ముభావంగా ఉంటూ వచ్చాడు. రోజూ బిడ్డను తలచుకుంటూ ఏడ్చేవాడు. నా బిడ్డ లేని లోకంలో నేనూ ఉండలేనంటూ కుటుంబ సభ్యులతో, సన్నిహితులతో అనేవాడు. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి అనంతపురం–తాడిచెర్ల మధ్య రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య మధులత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

చంద్రబాబు అరెస్ట్ చట్టబద్ధమే

- వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గాజుల ఉమాపతి



మాట్లాడుతున్న ఉమాపతి

అనంతపురం కార్పొరేషన్: కుప్పం ఎమ్మెల్యే, మాజీ సీఎం చంద్రబాబు అరెస్ట్ చట్టబద్ధంగానే సాగిందని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గాజుల ఉమాపతి అన్నారు. చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ ఇటీవల జిల్లా న్యాయస్థానం ఎదుట టీడీపీ లీగల్ సెల్ నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని ఆయన ఖండించారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా లీగల్ సెల్ ప్రతినిధులతో కలసి శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు కేసులో బెయిల్ వేసే అధికారం ఉన్నా ఆ దిశగా పిటీషన్ దాఖలు చేయకుండా న్యాయ వ్యవస్థను తప్పుదోవ పట్టించాలనుకోవడం టీడీపీ లీగల్ సెల్ నాయకులకు భావ్యం కాదన్నారు. స్కిల్ స్కాంను సీఐడీ తరఫున వాదిస్తున్న పొన్నవోలు సుధాకర్ రెడ్డికి కొందరు బెదిరింపు కాల్స్ చేయడంతో పాటు టీవీ 5 డిబెట్‌లో ఇష్టానుసారంగా మాట్లాడుతూ, సామాజిక మాధ్యమాల్లోనే పొన్నవోలు వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా పోస్టుంగులు పెట్టడం సరికాదన్నారు. కాపుల భవిష్యత్తు కోసం పార్టీని స్థాపించిన పవన్‌కళ్యాణ్ ఈ రోజు అదే కాపుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా రాజమండ్రి సెంట్రల్ జైలులో చంద్రబాబును పరామర్శించడం సిగ్గుచేటన్నారు. కాపు ఉద్యమకారుడు, తునిలో 50 లక్షల మందిని కలిపిన ముద్రగడ్డ పద్మనాభాన్ని పోలీసులు అరెస్టు చేసి, వారి కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురి చేసినప్పుడు ఎక్కడ దాక్కున్నాడో చెప్పాలని పవన్ కళ్యాణ్‌ను ప్రశ్నించారు. రానున్న రోజుల్లో టీడీపీ, జనసేనకు ప్రజలే సరైన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో శ్రీ సత్యసాయి జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి గొని నాగన్న, నాయకులు వెంకట్రాముడు, నాగిరెడ్డి, ఇలియాజ్ అహమ్మద్, సుబ్బేనాయక్, మహబూబ్‌ఖాన్, గోకుల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఇన్‌స్పైర్' నామినేషన్లు వేగవంతం చేయండి

- జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజు

రాప్తాడురూరల్: 'ఇన్‌స్పైర్ మనక్' కార్యక్రమానికి సంబంధించి నామినేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఉపాధ్యాయులకు డీఈఓ వి.నాగరాజు సూచించారు. 'నేషనల్ సైన్స్ కాంగ్రెస్' అంశంపై శనివారం అనంతపురంలోని సైన్స్ సెంటర్‌లో ఉన్నత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రతి ఉపాధ్యాయుడూ ఐఎఫ్ ప్యానల్‌తో పాఠాలు బోధించడంలో నైపుణ్యం సాధించాలన్నారు. సైన్స్ ప్రదర్శనకు ఉత్తమమైన ప్రాజెక్టులు సిద్ధం చేయించాలన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. జిల్లా సైన్స్ అధికారి బాల మురళీకృష్ణ మాట్లాడుతూ.. సైన్స్ కార్యక్రమాల్లో జిల్లాను ముందంజలో ఉంచేందుకు కృషి చేయాలని కోరారు. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ విధి విధానాలను రిసోర్స్ ఉపాధ్యాయులు మేడా ప్రసాద్, శామ్యూల్ ప్రసాద్, ఆనంద భాస్కరరెడ్డి, రాము వివరించారు.

క్లుప్తంగా

నిబంధనలు పక్కాగా అమలు చేయాలి

అనంతపురం రూరల్: పంచాయతీ నిబంధనలు పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రావు పేర్కొన్నారు. శనివారం పంగల్ రోడ్డులోని టీటీడీసీలో పంచాయతీ కార్యదర్శులకు (మూడవ బ్యాచ్) శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణ కార్యక్రమాలను పంచాయతీ కార్యదర్శులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంచాయతీ పరిధిలో కొత్త లే అవుట్ల ఏర్పాటు విషయంలో నిబంధనలు పాటించాలన్నారు.

ఏథర్ షోరూం ప్రారంభం



ఏథర్ కొత్త బైక్‌ను ప్రారంభిస్తున్న సినీనటి కామ్నా జఠ్మలాని

అనంతపురం సెంట్రల్: నగరంలో కోవూరునగర్ శివారులోని జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో నూతన ఏథర్ ద్విచక్ర వాహన షోరూంను శనివారం సినీ నటి కామ్నా జఠ్మలాని ప్రారంభించారు. షోరూం మేనేజింగ్ డైరెక్టర్ నివేదిత రెడ్డి మాట్లాడుతూ.. మొట్టమొదటి సారిగా స్వదేశీ ఐఐటీ విద్యార్థులు రూపొందించిన పూర్తి విద్యుత్ వాహనం ఏథర్ అని తెలిపారు. అల్యూమినియం బాడీ, కేసింగ్ బ్యాటరీతో వాహనం తయారు చేశారన్నారు. కిలోమీటరుకు రూ.38 పైసల ఖర్చుతో సౌకర్యవంతమైన ప్రయాణం చేయవచ్చని పేర్కొన్నారు. ఏథర్ వాహనం ఆరు ఆకర్షణీయమైన రంగుల్లో, మూడు వేరియేషన్లలో అందుబాటులోకి వచ్చినట్లు వివరించారు. సబ్సిడీ పోనూ ఎక్స్ షోరూం ధర రూ.1.34 లక్ష చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏథర్ షోరూం జనరల్ మేనేజర్ ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

అనంతపురం కార్పొరేషన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈనెల 30 నుంచి వైద్య శిబిరాలు జరుగుతాయి. స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ.భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. శనివారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్‌తో కలసి సమావేశం నిర్వహించారు. ఇప్పటికే ఇంటింటా సర్వే మొదలైందన్నారు. వివిధ రకాల సమస్యలున్న వారికి హెల్త్ క్యాంపుల్లో సేవలందించాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాల, ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రుల నుంచి 188 మంది స్పెషలిస్టు వైద్యులను నియమించడం జరిగిందన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి తమవంతు సహకారం అందిస్తామని ఐఎంఏ, నర్సింగ్ హోం నాయకులు తెలిపారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సుజాత, డాక్టర్ యుగంధర్, డాక్టర్ చెన్నకేశవులు, ఓబులు, ఉమాపతి, ఆరోగ్య శ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్ రెడి పాల్గొన్నారు.

వ్యవసాయంలో డ్రోన్లు



మందుల పిచికారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయంలో ఇకపై డ్రోన్లు కీలకపాత్ర పోషించనున్నట్లు రేకులకుంటలో ఉన్న వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, శాస్త్రవేత్తలు డాక్టర్ రాధిక, డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై శనివారం ఆత్మకూరు మండలం సనప గ్రామం రైతుల సమక్షంలో వ్యవసాయశాఖ ఏడీ ఎం.రవి, ఏఓ సుచరిత, ఆర్‌బీకే అసిస్టెంట్లు ప్రయోగాత్మక పరిశీలన చేశారు. డ్రోన్ ద్వారా ఒకసారి 10 లీటర్ల పురుగుల మందు ఒక ఎకరా విస్తీర్ణంలో ఐదు లేదా 10 నిమిషాల్లోపు పిచికారీ పూర్తయిందన్నారు. ఎకరా విస్తీర్ణంలో పిచికారీ చేయడానికి రూ.500 రుసుం వసూలు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో మరికొన్ని గ్రామాల్లో మందుల పిచికారీ కొనసాగిస్తామన్నారు.

నేడు విశ్వకర్మ జయంతి

అనంతపురం రూరల్: నగరంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో ఆదివారం ఉదయం 10:30 గంటలకు విశ్వకర్మ జయంతి నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు హాజరవుతారన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

అనంతపురం క్రైం: వినాయక ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకుందామని నాల్గవ పట్టణ సీఐ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం పోలీసు స్టేషన్ పరిధిలో వినాయక మంటపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. కమిటీ వివరాలను సంబంధిత పోలీస్ స్టేషన్‌కు తెలపాలన్నారు. గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీలు పోలీసులకు అందజేసి అనుమతులు తీసుకోవాలన్నారు. అగ్నిమాపక, విద్యుత్ శాఖల అనుమతి తప్పదన్నారు. నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

పొత్తుతో ఒరిగేది శూన్యం

- టీడీపీ కనుమరుగు కావడం ఖాయం
- చంద్రబాబు అరెస్ట్‌తో ఎన్టీఆర్ ఆత్మ శాంతించింది
- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



లబ్ధిదారులకు పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

రాప్తాడు: 'చంద్రబాబు నాయుడు అరెస్ట్‌తో టీడీపీ దిక్కుతోచని స్థితిలో పడింది. జనసేన, టీడీపీ పొత్తుతో ఒరిగేదేమీ లేదు. త్వరలో ఆ పార్టీ కనుమరుగు కావడం ఖాయం' అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్రా వెంకటేష్‌తో కలసి 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. 'అమ్మా నేను మీ బిడ్డను.. మీ సమస్యలను పరిష్కరించేందుకే మీ గడపకూ వచ్చాను. మీకు ఏ కష్టమొచ్చినా నాతో చెప్పండి. అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తాం' అంటూ వృద్ధులు, మహిళలు, గ్రామ ప్రజలకు భరోసా కల్పించారు.

ప్రసన్నాయపల్లి పంచాయతీ అభివృద్ధికి కృషి

ప్రసన్నాయపల్లి పంచాయతీని మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.1.30 కోట్లతో అనంతపురం రూరల్ గ్రామ సచివాలయం నుంచి స్థానిక ముత్యాలమ్మ గుడి వరకూ జేఎన్‌టీయూ రోడ్డును నిర్మించామన్నారు. రూ.57 లక్షల నిధులతో ముత్యాలమ్మ గుడి దగ్గర నుంచి రైల్వే బ్రిడ్జి వరకు రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. రూ.1.60 కోట్లతో సీసీ రోడ్డు, రూ.66 లక్షలతో నాడు-నేడు పనులు చేయించినట్లు వెల్లడించారు. సచివాలయం, ఆర్బీకేలు నిర్మించామన్నారు. త్వరలోనే ఎల్లార్జి పాఠశాల ముందున్న రోడ్డును కూడా వేయిస్తామన్నారు. ఇప్పటి వరకూ పంచాయతీకి దాదాపు రూ.6 కోట్లు ఖర్చు పెట్టామన్నారు.

పవన్‌కు ప్యాకేజీలే ముఖ్యం..

స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్ట్ కావడంతో ఎన్టీఆర్ ఆత్మ శాంతించిందన్నారు. అక్రమాలకు పాల్పడి చంద్రబాబు అరెస్ట్ అయితే ఆయనకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మద్దతివ్వడం సరికాదన్నారు. టీడీపీ, జనసేన కలసి పోటీ చేస్తాయని ప్రకటించడంతో పవన్ స్వభావం ప్రజలకు తెలిసిపోయిందని స్పష్టం చేశారు. జనసేన నేతలకు కావాల్సింది ప్రజా సంక్షేమం కాదని ప్యాకేజీలు మాత్రమేనని విమర్శించారు. అవినీతికి పాల్పడిన వారిని, వారికి వత్తాసు పలికే వారిని ఇంటింటికి పంపేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీ నరసింహ, ఎంపీడీఓ సాల్మన్, హౌసింగ్ డీఈ దేవరకొండ రామ్మూర్తి, ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, గొర్రెలు, మేకల సంఘం జిల్లా అధ్యక్షుడు పసుపుల నరసింహ గౌడ్, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణ స్వామి, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, స్థానిక నాయకులు మాజీ ఎంపీటీసీ రాజశేఖర్, లోకేశ్వర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, విజయ్‌వర్ధన్ రెడ్డి, ఉషారాణి, భాగ్యలక్ష్మి, షాను తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: ప్రజారోగ్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సర్కార్ పెద్దపీట వేస్తోందని మేయర్ వసీం పేర్కొన్నారు. శనివారం నగరంలోని 24వ డివిజన్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటా సర్వేను కమిషనర్ భాగ్యలక్ష్మితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజల ముంగిటకే వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో 64 రకాల వైద్య పరీక్షలు, 172 రకాల మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. జీజీహెచ్‌ను బలోపేతం చేసేలా నాడు-నేడు కింద రూ.300 కోట్లు కేటాయించారని తెలిపారు. రానున్న రోజుల్లో ఎంసీహెచ్, సర్జికల్ బ్లాక్ ఏర్పాటు చేసి రోగులకు మరింత నాణ్యమైన వైద్యాన్ని అందిస్తారన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, కార్పొరేటర్ సంపంగి రామాంజినేయులు, ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, నాయకుడు మధు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పంపనూరులో శనివారం డాక్టర్ దయాకర్ ఆధ్వర్యంలో ఇంటింటా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సర్వే నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతి ఇంటికి తిరిగి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి టోకెన్లు ఇచ్చినట్లు తెలిపారు.

ఆవిష్కరణలకు వేదిక 'సీయూఏపీ'

- సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ వీసీ ఎస్ఏ కోరి



అనంతపురం: నూతన ఆవిష్కరణలకు వేదికగా సీయూఏపీ (సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ) నిలుస్తోందని వీసీ ప్రొఫెసర్ ఎస్.ఏ. కోరి అన్నారు. శనివారం వర్సిటీలోని వివిధ విభాగాల్లో నూతనంగా చేరిన విద్యార్థులకు స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని రకాల వసతులతో త్వరలోనే శాశ్వత క్యాంపస్ నిర్మాణం జరగనుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సాంకేతిక ప్రయోగశాల నిర్మాణం జరుగుతున్న అంశాన్ని ప్రస్తావించారు. నార్త్ ఈస్ట్ హిల్ వర్సిటీ (షిల్లాంగ్) విశ్రాంత ప్రొఫెసర్ ఎస్.రామారావు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తు ఉన్నత స్థానంలో నిలపడంతో వర్సిటీ పాత్ర ఎనలేనిదన్నారు. డీన్ ఇంచార్జి ప్రొఫెసర్ జి.రాంరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రణాళికతో వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంగ్లిష్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.పరిమళ, తెలుగు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ గరికపాటి గురుజాడ, ఎస్వీ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వీవీఎన్ రాజేంద్రప్రసాద్, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ బాబు గోపాల్, డాక్టర్ కేశవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలే ముద్దు



రామచంద్ర నగర్‌లో వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయ భాస్కరరెడ్డి, కోగటం శ్రీదేవి



ముత్యాలమ్మ ఆలయంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న త్రీటౌన్ సీఐ ధరణీ కిశోర్, కార్పొరేటర్ గురుశేఖర్ బాబు

అనంతపురం కల్చరల్: శ్రీనివాసనగర్, పాతూరులోని ప్రాచీన దత్తాత్రేయస్వామి ఆలయం, రామచంద్రానగర్‌లోని కోగటం శ్రీదేవి ఆధ్వర్యంలో శనివారం మట్టి వినాయక విగ్రహాల పంపిణీ సందడిగా సాగింది. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి ఆత్మీయ అతిథిగా పాల్గొని వేలాది విగ్రహాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మట్టి ప్రతిమలను పూజించాలని సూచించారు. ఆళ్లగడ్డ రాము, అప్పా సుధీర్, డాక్టర్ మనోరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

సాయిట్రస్టు ఆధ్వర్యంలో..

సాయిట్రస్టు ఆధ్వర్యంలో సినీనటి కామ్నాజఠ్మలాని మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వాడకం వల్ల నీరు కలుషితం అవుతోందన్నారు. పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్న సాయిట్రస్టు సభ్యులను అభినందించారు. విజయ్ సాయి, రాఘవేంద్ర, నాయక్ పాల్గొన్నారు.

చిట్టి చేతుల్లో మట్టి గణపతి..

రాప్తాడురూరల్: సంగమేష్‌నగర్, గుత్తి రోడ్డులోని మాంటిస్సోరి విద్యా సంస్థల్లో శనివారం 'చిట్టి చేతుల్లో మట్టి గణపతి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు బంకమట్టి, ప్రకృతి సహజమైన రంగులు వినియోగించి బొజ్జ గణపయ్య విగ్రహాలను తయారు చేసి ప్రదర్శించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలతో కలిపి వినాయక విగ్రహాలను తయారు చేయడంతో వాతావరణ కాలుష్యమవుతుందని విద్యా సంస్థల అధినేత సి.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. విద్యా సంస్థల కార్యదర్శి కె.మాధవి, ప్రిన్సిపాల్స్ ఎ.రమాదేవి, కె.పద్మావతి పాల్గొన్నారు.

మినర్వా స్కూల్‌లో..

అశోక్‌నగర్‌లోని మినర్వా పాఠశాల విద్యార్థులు సృజనకు పదునుపెట్టి బంకమట్టితో వినాయక విగ్రహాలను తయారు చేశారు. కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత భావితరాలపై ఉందన్నారు.

50వ డివిజన్‌లో..

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 50వ డివిజన్ నసనకోట ముత్యాలమ్మ దేవాలయంలో కార్పొరేటర్ గురుశేఖర్ బాబు ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక విగ్రహాలను అందించడం అభినందనీయమని టౌన్ ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్ సంజీవ్‌కుమార్, త్రీటౌన్ సీఐ ధరణికిశోర్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బిందుప్రియ పాల్గొన్నారు.



వేషధారణల్లో మాంటిస్సోరి విద్యార్థులు



మినర్వా స్కూల్‌లో విద్యార్థుల సందడి

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడు: మండల కేంద్రానికి చెందిన 4వ వార్డు మెంబర్ భోగం ముత్యాలన్నకు ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి అండగా నిలిచారు. వివరాలు.. ఈనెల 14వ తేదీన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి రాప్తాడులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఆయన.. భోగం ముత్యాలన్న ఇంటి వద్దకు వెళ్లారు. భోగం ముత్యాలన్న తండ్రి భోగం నరసింహులును పరామర్శించారు. ముత్యాలన్నకు ఎలా ఉందని ఆరా తీశారు. అధైర్యపడొద్దని.. అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. శనివారం ఇచ్చిన హామీ మేరకు స్థానిక నాయకుల ద్వారా రూ.లక్ష ఆర్థిసాయాన్ని భోగం నరసింహులుకు అందజేయించారు. కార్యక్రమంలో గొర్రెలు, మేకల సంఘం జిల్లా అధ్యక్షుడు పసుపుల నరసింహ గౌడ్, వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, నాయకులు సాకే చంద్ర, వార్డు మెంబర్ జయన్న, నారాయణ, మాచిరెడ్డి చెన్నారెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

రేడియోగ్రాఫర్‌ను మార్చండి

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం కార్పొరేషన్: మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన రేడియోగ్రాఫర్‌ను రేడియాలజీలోని మరో ప్రాంతంలో విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని రేడియాలజీ హెచ్ఓడీ డాక్టర్ సురేష్‌ను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు ఆదేశించారు. శనివారం సర్వజనాస్పత్రిలో కీచకుడు అన్న కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు స్పందించారు. ఎక్స్‌రే, సిటీ స్కాన్, ఎంఆర్ఐ, అల్ట్రాసౌండ్ తదితర వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ముఖ్యంగా రేడియోగ్రాఫర్‌లో మార్పురాకపోతే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి పంపాలని ఆదేశించారు.

గ్రూప్-1 విజేతలకు నేడు అభినందన

అనంతపురం టవర్ క్లాక్: ఇటీవల విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో విజేతలుగా నిలిచిన వారికి నగరంలోని మాసినేని గ్రాండ్ హోటల్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు అభినందన సభ నిర్వహిస్తున్నట్లు 'ఫర్ ది సొసైటీ' సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పోతుల రాధాకృష్ణ శనివారం తెలిపారు. సభకు ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిన వీరభద్రుడు, ఎస్కే యూనివర్సిటీ రిజిస్ట్రార్ లక్ష్మయ్య, నంద్యాల అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు తదితరులు హాజరవుతున్నారన్నారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి

రాప్తాడు రూరల్: రోడ్డు ప్రమాదంలో భర్త దుర్మరణం చెందగా.. భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతపురం రూరల్ పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం షెక్షానుపల్లికి చెందిన దంపతులు చిన్న ఓబులేసు (42), తిప్పమ్మ శుక్రవారం అనంతపురంలో ఓ బంధువు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అనంతరం శనివారం ఉదయం స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. బళ్లారి రోడ్డులోని ఆదర్శ నర్సింగ్ కళాశాల వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న కారు డ్రైవరు ఆటోను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన దంపతులను స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా జీజీహెచ్‌కు తరలించారు. అప్పటికే చిన్న ఓబులేసు మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. భార్య తిప్పమ్మ చికిత్స పొందుతోంది. ప్రమాదస్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

నగర శివారులో మరొకరు..

రాప్తాడురూరల్: ఉరవకొండ మండలం మైలారంపల్లి గ్రామానికి చెందిన గంగప్ప (38) శనివారం అనంతపురం నగర శివారులోని ఎంవైఆర్ కళ్యాణ మంటపం ఎదుట జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంగప్ప, మరో వ్యక్తి రెండు బైకుల్లో మాట్లాడుకుంటూ ఉరవకొండ వైపు వెళ్తున్నారు. వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టింది. గంగప్ప అక్కడిక్కడే మృతి చెందగా.. మరో వ్యక్తి గాయాలతో బయటపడ్డాడు. రూరల్ పోలీసులు గంగప్ప మృతదేహాన్ని సర్వజన ఆస్పత్రికి తరలించారు. బంధువులకు సమాచారం చేరవేశారు. గాయాలతో బయట పడిన ఈయన చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

'ఆ కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టండి'

అనంతపురం సిటీ: శ్రీసత్యసాయి జిల్లాలోని శ్రీరామరెడ్డి తాగునీటి పథకంలో అక్రమంగా నిధులు కాజేసిన కాంట్రాక్టర్లు ఎల్‌కే నాయుడు, గోవర్దన్‌రెడ్డిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని సీఐటీయూ ప్రతినిధులు కోరారు. శనివారం ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను క్యాంప్ కార్యాలయంలో కలసి, వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు ఓబులు, నాగేంద్ర పాల్గొన్నారు.

పీఆర్ ఈఈగా చంద్రశేఖర్

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్ శాఖ అనంతపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ)గా బి.చంద్రశేఖర్ నియమితులయ్యారు. కర్నూలు జిల్లా టిడ్కో విభాగంలో పని చేస్తున్న ఈయన్ను ప్రభుత్వం అనంతపురానికి బదిలీ చేసింది. శనివారం ఆయన పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్‌ను కలసి బాధ్యతలు స్వీకరించారు.

ఆర్ట్స్ కళాశాలలో కార్యశాల

రాప్తాడురూరల్: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆంగ్ల విభాగం, స్పందన సాంస్కృతిక వేదిక సంయుక్త ఆధ్వర్యంలో 'శరత్ చంద్ర చటర్జీ రచనలు-సమకాలిన పరిస్థితుల్లో వాటి ఆవశ్యకత' అనే అంశంపై శనివారం కార్యశాల నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి , వైస్ ప్రిన్సిపల్ శశాంక మౌళి మాట్లాడుతూ.. శరత్ చంద్ర రచనలు, వాటి విలువ గురించి మాట్లాడారు. ఇంగ్లిష్ విభాగాధిపతి డాక్టర్ తాళంకి జీవన్ కుమార్, స్పందన సంస్థ ప్రతినిధి ఎస్.గోవిందరాజులు పాల్గొన్నారు.

రజకులకు బహిరంగ క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న రజక కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మీసాల రంగన్న

అనంతపురం కార్పొరేషన్: రజకుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా టీడీపీ మద్దతుదారులు వ్యవహరిస్తున్నారు. టీడీపీ నాయకులు బేషరతుగా రజకులకు క్షమాపణ చెప్పాలని రజక కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మీసాల రంగన్న డిమాండ్ చేశారు. శనివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల బెంగళూరులో ఓ మహిళ చంద్రబాబును శ్రీరామచంద్రుడితో పోల్చుతూ చాకలి కులస్తుడి కారణంగా సీతమ్మ అడవికి వెళ్లిందని చెప్పిందన్నారు. అలాగే చంద్రబాబు నాయుడు సచ్చీలుడిగా విడుదలవుతారని చెప్పడం జరిగిందన్నారు. యువత భవిష్యత్తుతో ఆటలాడిన చంద్రబాబును న్యాయస్థానం కటకటాలకు పంపిందన్నారు. టీడీపీ కనుసన్నల్లోనే నిరసనలు జరుగుతున్నాయన్నారు. సదరు మహిళ మాటల వెనుక టీడీపీ నాయకుల హస్తం ఉందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మునిశేఖర్, నాయకులు హనుమన్న, సుబ్రమణ్యం, మాలపాటి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ ఫక్కీరప్పకు జాతీయ స్థాయి అవార్డు



సెల్‌ఫోన్లను పరిశీలిస్తున్న జిల్లా పూర్వ ఎస్పీ ఫక్కీరప్ప (ఫైల్)

అనంతపురం క్రైం: జిల్లా పూర్వ ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్పకు జాతీయ స్థాయి పురస్కారం దక్కింది. జిల్లాలో ఆయన పనిస్తున్న సమయంలో ప్రజలు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను చాట్‌బాట్ సేవల ద్వారా రికవరీ చేసి అనంతతో పాటు ఇతర రాష్ట్రాల వినియోగదారులకూ ఉచితంగా కొరియర్ సర్వీసు ద్వారా అందజేశారు. దీంతో ప్రతిష్టాత్మకమైన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. 'స్మార్ట్ పోలీసింగ్ అవార్డ్స్' పేరిట జాతీయ స్థాయిలో ఏటా అందచేసే ఈ ప్రతిష్టాత్మక అవార్డు 2022కి గాను రాష్ట్ర వ్యాప్తంగా ఐదుగురు పోలీసు ఉన్నతాధికారులు ఎంపిక కాగా, వారిలో ఫక్కీరప్ప ఒకరు కావడం గమనార్హం.

ఉత్సాహంగా అథ్లెటిక్స్

రాప్తాడురూరల్: నగరంలోని కొత్తూరు బాలుర పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న మండల, నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. గెలుపొందిన విద్యార్థులను జిల్లా పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, బాలకృష్ణ, కృష్ణారెడ్డి, ప్రవీణ్ కుమార్, శ్రీదేవి, లావణ్య, లీజ కుమారి, సుగంధ, మధు ప్రసాద్, విజయశ్రీ పాల్గొన్నారు.

ఆత్మకూరు: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ప్రతిభ కనబరచిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు నియోజకవర్గ సమన్వయ కర్తలు రాజశేఖర్‌రెడ్డి, నాగరాజు తెలిపారు.

లోక్‌అదాలత్ సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు

అనంతపురం: ప్రజా ప్రయోజన సేవల శాశ్వత లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం అనంతపురం జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్‌లో నగర పాలక సంస్థ వార్డు అడ్మిన్ కార్యదర్శులకు ప్రజా ప్రయోజన సేవల శాశ్వత లోక్ అదాలత్ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సహజ న్యాయ సూత్రాల ఆధారంగానే శాశ్వత లోక్ అదాలత్‌లో వివాద పరిష్కారం జరుగుతుందన్నారు. మధ్యవర్తిత్వ కేంద్ర సభ్యులు న్యాయవాది హరికృష్ణ మాట్లాడుతూ కోర్టులలో దాఖలు చేయని వివాదాలు మాత్రమే శాశ్వత లోక్ అదాలత్‌లో దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు. శాశ్వత లోక్ అదాలత్ సభ్యులు రాజశేఖరరెడ్డి, ఎంఎల్ఎన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజా ప్రయోనాల శాశ్వత లోక్ అదాలత్‌లో ఫిర్యాదు దాఖలు చేయడానికి ఎటువంటి కోర్టు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

అభినందనల వెల్లువ..

జిల్లా షెడ్యూల్డు కులాలు, తెగల అత్యాచార నిరోధక కోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గరికపాటి దీనబాబును శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు, సభ్యులు ఎంఎల్ఎన్ శ్రీనివాసరావు, రాజశేఖరరెడ్డి, న్యాయవాదులు, సిబ్బంది అభినందించారు.

